


# కాలం కాటేసింది

పిల్లలమర్రి వెంకట్రామయ్య

రామన్ ఇంకా అలాగే నడుస్తూ ఉన్నాడు. రోళ్ళు పగిలే రోహిణీకార్తి మండుటెండలా మధ్యాహ్నం పన్నెండుగంటలైంది. ఆసమయంలో కాళ్ళకి చెప్పులైనా లేకుండా ఫుట్‌పాత్‌మీద నడవటం సులభమైన పనేమీకాదు ఒకటిరెండురిక్షాలు. సిటీ బస్సులు టాక్సీలు మినహా రోడ్డంతా దాదాపు నిర్మానుష్యంగా ఉంది. ఎండవేడి భరించలేని ప్రజలు. చేరెడు నీడ ఎక్కడ దొరికితే అక్కడికి చేరుతూ ఉన్నారు. డబ్బున్న మహారాజులు 'ఎయిర్ కండిషన్డు' గదుల్లో కూర్చుని కూల్ డ్రింక్స్ సేవిస్తూ ఉంటే గతిలేని పేదవాళ్ళు చలివేంద్రాల దగ్గర ... నీళ్ళతాగి సేదతీర్చుకుంటున్నారు. కాని రామన్ మాత్రం అలసటలేకుండా అట్లాగే నడుస్తూ ఉన్నాడు.

ఉదయం ఎప్పుడో ఉడిపి హోటల్లో త్రాగిన కాఫీ. మళ్ళీ ఇప్పటివరకూ నీళ్ళుఅయినా తాగలేదు తను. కడుపులో ఆకలి చుర్రుమంటోంది ఎదురుగా ఉన్న హోటలుని చూసి. లోపలికి పోదాం అనుకుంటూ. జేబుతడిమి చూసుకున్నాడు. పదిపైసలబిళ్ళమాత్రమే ఉన్నది జేబులో. తన హీనస్థితికి కన్నీళ్ళు గిర్రున తిరిగాయి అతనికి అతని ఆత్మాభిమానం దెబ్బతిన్నది. తనవంక ఎవరైనా చూస్తూ ఉన్నారేమో అని. ఇటు అటు చూసి ప్రక్కనే ఉన్న కిళ్ళీ కొట్టుకుపోయి ఒక సోడా త్రాగి. సిగరెట్ తీసికొని ముట్టించాడు. జేబు ఖాళీ అయినా. కొంత సంతృప్తి కలిగింది

రామన్ మళ్ళీ నడకసాగించాడు. ఉదయం తను ఇల్లు వదలి వచ్చేటప్పుడు చెప్పిన గృహిణిమాటలు ఇంకా అతని చెవుల్లో గింగురుమంటున్నాయి

'పిల్లకి పాలులేవు. పాలడబ్బా కట్టుకోవాలండి. ఇల్లు అయ్యవారి నట్టిల్లులాగా ఉన్నది బియ్యంతో సహా అన్నీ తేవాలి' అని చెప్పింది. ఈ రోజు ఎక్కడైనా ఉద్యోగంలో చేరాలి. అడ్వాన్సు తీసుకోవాలి. ఏ ఉద్యోగమైనాసరే అని బయలుదేరాడు. కాని...తనకి ఏ ఉద్యోగం వస్తుంది. తనకు ఉన్న ఆ B. A. డిగ్రీకి విలువ ఏమున్నది ఈరోజుల్లో. ఉద్యోగానికి ఎన్ని తంటాలు పడాలి ఎన్ని రికమెండేషనులు. ఎన్ని లంచాలు. ఎంతమందిని ప్రార్థించాలి. రిట్రెంచ్‌మెంటులో ఉద్యోగాలు పోగొట్టుకున్న ఇంజనీరులు, బట్టలకొట్లలో గుమాస్తాలుగా ఆఫీసుల్లో దఫేదారులుగా వెళ్ళే దుస్థితి కలిగిన ఈ ఆంధ్రలో తనకి ఏ ఉద్యోగం దొరుకుతుంది?

ఆకలితోపాటే కోపం కూడా అతన్ని దహించివేస్తోంది. కాని ఎవరిమీద చూపిస్తాడు తనకోపాన్ని? పేదవాడికోపం పెదవుల చేటు అన్నట్లు. తానేమీ సాధించలేడు. తనవంటి అసమర్థుడు జీవించడం వృథా. కట్టుకున్న భార్యకీ, కన్నబిడ్డకీ అన్నంపెట్టలేని అభాగ్యుడు తను.

ఒక్కసారి అతనికి తన కాలేజీ జీవితం జ్ఞాపకం వచ్చింది.

ఆ రోజులు ఎంత సంతోషంగా ఉండేవి అది తన జీవితంలో సువర్ణకాలం. జమీందారీలు రద్దు అయినా, అమిత సంపన్న కుటుంబంలో జన్మించాడు తను. తల్లిదండ్రులకు ఏకైక సంతానం కావటంవల్ల, తన ముద్దుముచ్చటలకు ఏ లోటూ లేదు. హైస్కూలు చదువూ కాలేజీ చదువుకూడా ఎంతో సంతోషంతో జరిగిపోయింది. గుంటూరులో A. C కాలేజీలో చదివేటప్పుడే జానకి తనకు సన్నిహితురాలైంది. ఆమెకూడా రామన్‌తోపాటు ఇంటర్‌మీడియట్‌లో చేరింది. తొలిరోజుల్లోనే ఒకరినొకరు ఆకర్షించుకొని, సన్నిహితులైనారు.

ఆటలపోటీలలోనూ, చిత్రకళలోనూ, సాహిత్యరంగంలోనూ రామన్ అగ్రగామిగా ఉండేవాడు. చదువులోకూడా అందరికన్న ప్రథముడుగా ఉండేవాడు. అందువల్లనే రామన్ అంటే విద్యార్థులకే కాక. అధ్యాపకులకి కూడా ఆదరాభిమానములుండేవి.

జానకి బీదఇంటి పిల్ల. కులం తక్కువ అయినా సుగుణ సంపదకి లోటు లేనిది. ఆమె అందం చూపరులను ఇట్టే ఆకర్షించుతుంది. ఆమెకూడా రామన్‌కి సరియైన ప్రతిభా విశేషాలు కలది. ఇద్దరివీ ఒకే భావాలు కావటం వల్లనే ఒకరికొకరు సన్నిహితులైనారు.

చదువు పూర్తికాగానే రామన్‌కి వివాహ ప్రసక్తి వచ్చింది. ఇంట్లో. సిరిసంపదలతో తులతూగే సంపన్న గృహస్థు లనేకమంది తమ సంబంధము చేసుకోమంటూ వచ్చేవారు. కాని రామన్. జానకినే వివాహమాడతానని పట్టుపట్టేడు. వర్ణాంతర వివాహానికి సుతరామూ ఒప్పుకోని తండ్రిని ఎదిర్చి, కుటుంబంతోనూ, తల్లిదండ్రులతోనూ అనుబంధం తెంపుకుని, జానకిని వివాహమాడేడు.

తనమాట వినలేదనే కోపంతో రామన్ తండ్రి. "నాకు కొడుకే పుట్టలేదనుకుంటాను" అని ఆ స్తిని అంతా జీవకారుణ్య సంఘానికి వ్రాసియిచ్చి కాశీ వెళ్ళిపోయాడు భార్యతో. జానకితో వివాహం చాలా సంతోషంగా జరిగింది. అనేకమంది స్నేహితులూ సంస్థలూ రాజకీయ నాయకులూ. ఈ వివా

హానికి వచ్చి, దంపతులని దీవించారు ఆదర్శప్రాయుడని రామాన్ని పొగిడేరు. పెళ్ళి అయిన కొత్తలో నవదంపతుల జీవితం సౌఖ్యప్రదంగానే సాగింది. కాని... జీవితానికి అన్నిటికన్న ముఖ్యమైన సమస్య ఆర్థిక సమస్య. డబ్బులేనివాడు వ్యర్థుడు.

పెళ్ళి అయిన తొలి రోజులనుండీ రామన్ ఉద్యోగంకోసం ప్రయత్నించుతూనే ఉన్నాడు. కాని ఆ ప్రయత్నాలన్నీ వ్యర్థమే అయినాయి. ఈ సంసార పరిస్థితులకి తట్టుకోలేక జానకికూడా ఉద్యోగ ప్రయత్నం చేసింది. ఒక వ్యాపార సంస్థలో గుమాస్తాగా చాలీచాలని జీతంతో ఆమెకి ఉద్యోగం దొరికింది.

మన సమాజంలో విద్యావంతులు, ధనికులు ఉద్యోగస్తులు అయిన వాళ్ళలోకూడా కొందరి మనస్తత్వం చాలా హీనంగా ఉంటుంది. పైకి పెద్ద మనుష్యులలాగా చెలామణీ అయ్యేవారే నీచ కార్యాలకి పాల్పడుతూ ఉంటారు. జానకి పనిచేసే వ్యాపార సంస్థ అధిపతి కూడా ఇదేకోవకు చెందినవాడు ఒక రోజున సాయంత్రం ఆఫీసులో గుమాస్తాలందరూ వెళ్ళిపోయేక, అతను జానకిని తన ఆఫీసు గదికి రమ్మని అసభ్యంగా ప్రవర్తించాడు. జానకి జుగుప్సతోనూ, కోపంతోనూ అతనిని తిట్టి, విసురుగా బయటికి వచ్చింది. మర్నాడు ఆఫీసుకు వెళ్ళకుండా తన రాజీనామాలేఖను పంపింది. రామన్‌కి ఈ సంగతులు ఏమీ చెప్పలేదు ఆమె. మళ్ళీ నిరుద్యోగము ఆర్థికసమస్యలూ ఎదురైనాయి. జానకి ఉద్యోగం చేయుటం రామన్‌కి యిష్టంలేదు. దాని వల్ల తన స్థానం మరీ హీనమైంది. సంఘం దృష్టిలో తాను అసమర్థుడు. భార్య సంపాదిస్తుంటే తిని తిరిగే సోమరిగా సమాజం తనని భావిస్తోందని తెలుసు. ఇవా పరిస్థితుల ప్రాబల్యానికి తల ఒగ్గి అతడు ఆమెను ఉద్యోగానికి పోనిచ్చాడు. కాని ఈనాడు అమె అంతట ఆమె, 'ఇక నేను ఉద్యోగం చేయను. ఏది ఎల్లా జరిగితే అట్లాగే అవుతుంది" అని తనతో అన్నప్పుడు అతడు ఎంతో సంతోషించాడు. మానసికంగా అతనికెంతో తృప్తి కలిగింది. అయితే ఇల్లు గడపటమెల్లాగ అనేదే ప్రశ్న.

గర్భిణిగా ఉన్న తన భార్యకి కనీసం విశ్రాంతినైనా ఇవ్వలేకపోయానే! పాలు, పండ్లూ లేకపోతే మానె ..కనీసం కడుపునిండా అన్నమైనా లేకపోయిందే అని విచారించేవాడు. కొన్ని రోజులు షీసు గుమాస్తాగానూ, కొన్ని రోజులు బట్టలకొట్లో బిల్లులువ్రాసి కొన్ని రోజులు పిల్లలకు పాఠాలు చెప్పి - ఇల్లాగే ఏదో వ్యాసంగంతో ఏ కొద్దిగానో సంపాదిస్తే అది సంసారానికి చాలేది కాదు. శ్రమపడ్డా ఫలితం లేకుండా పోయేది తొలికాన్పుకే జానకికి చాలా జబ్బుచేసింది. హాస్పిటల్‌లో కాన్పు జరిగినా, ఖర్చులు తప్పలేదు. ఎన్ని ఇబ్బందులతో తిరిగి భార్యాబిడ్డలని ఇంటికి తీసికొని వెళ్ళకలిగాడో దేవుడా!

బిడ్డపైన రామన్‌కి ఎంతోమమకారం. అన్నికష్టాలలోగూడా, ఆఅమాయకలేతహృదయం తనవంక చూసినోటితో నవ్వితే అతనికి ఎంతో ఆహ్లాదంగా ఉండేది. సర్వమూమరచి పాపను హృదయానికి హత్తుకునేవాడు, కాని జానకిఆరోగ్యం మళ్ళీ పాడైపోయింది. లేవటానికికూడా ఓపిక లేనంతగా బలహీనురాలయింది. ఆయాసంతోనూ, దగ్గుతోనూ, బాధపడుతూ ఉండేది. దగ్గుతోపాటు రక్తం పడటం చూసి భయపడి. రామన్ ఆమెను డాక్టరు దగ్గరకు తీసికొని వెళ్ళాడు. ఆమెను పరీక్షించి చూసిన డాక్టర్ అది T.B. అనీ, బలమైన ఆహారమూ, విశ్రాంతీ పాలూ, పండ్లూ ఇవ్వాలని, ఏవేవో మందులు వ్రాసి ఇచ్చాడు.

అది విని విభ్రాంతుడైనాడు రామన్. అందుకే ఈవేళ ఉదయంనుండీ పట్టుదలతో ఏ ఉద్యోగమైనా సరే సాధించాలని ప్రయత్నిస్తూ ఉన్నాడు.

ఈ ఆలోచనలన్నీ అతన్ని ముంచివేశాయి... దూరంగా ఎక్కడో నవ్వులు వినబడ్డాయి. తన అసమర్థతచూసి లోకులు నవ్వుతున్నారా! అన్నట్లు అతను తలఎత్తి చూశాడు. ఎదురుగా తన స్నేహబృందము...రమణా మోహన్, సుందరం... వస్తున్నారు.

'అడుగో రామన్" అన్నాడు సుందరం.

"ఏరోయ్ రామన్... ఎల్లా ఉన్నావు. ఎక్కడ ఉన్నావు ఏమిటి కథ..." అన్నాడు రమణ.

> చింపంజీ కోతులకూ మనుషులకూ మధ్య మరోముఖ్యమైన తేడాకూడా వుంది ...చింపంజీలు ఒకదాన్ని ఒకటి చంపుకోవు.
>
> —బాప్‌మన్ పించర్

"ఇదేమిరా! ఎండలు మండిపోతూ ఉంటే స్వెట్టరు వేసుకున్నావు! అవునులే. మీరు కవులుగా. మండుటెండ వెన్నెలగానూ వడగాల్పులు మలయమారుతాలుగాను అనిపిస్తాయి మీకు.'

'ఏంలోకం ఇది' అనుకొని నిట్టూర్పువిడిచాడు రామన్. చొక్కాలకు ఉన్న చిరుగులు కనబడకుండా తొడుక్కున్నాడు స్వెట్టరు అది ఒక్కటే మిగిలింది ఇంట్లో గట్టిది.

'ఉండరా పాపం! వాడు ఇన్ని సంవత్సరాలకు కనబడితే మంచీ చెడూ మాట్లాడకుండా ...' అన్నాడు సుందరం.

'అయితే రోడ్డుమీద ఎందుకూ. . ఎక్కడైనా కూర్చుందాం రండి" అని ప్రక్కనే ఉన్న టిఫిన్ పార్లర్‌కి దారితీశాడు రమణ. "నలుగురికీ నాలుగు డ్రింకులు తీసికొనిరా" అని చెప్పి కుర్చీలో కూర్చున్నారు. సీలింగుఫాను గిర్రున తిరుగుతూంది ఒక్క క్షణం చల్లగాలి శరీరానికి తాకగానే పేద తీరినట్లు అనిపించింది అందరికీ.

రమణ సంభాషణకు ఉపక్రమించాడు. కాలేజీ వదలగానే మద్రాసుపోయి, అక్కడ ఒక ఇంగ్లీషు దినపత్రిక ఆఫీసులో చేరానని, క్రమంగా ఎడిటరుగా నియమింపబడ్డానని చెప్పాడు. ఆ పత్రిక అధిపతులు ఇప్పుడు మద్రాసునుంచేకాక విజయవాడ, మధుర, హైదరాబాదులనుండీకూడా ఆ పత్రికను ఏకకాలంలో ప్రచురించటానికి నిర్ణయించారు. విజయవాడ ఆఫీసు అధిపతిగానూ, ఎడిటరుగానూ రమణ నియమింపబడ్డాడు. ఈ సంగతులన్నీ చెప్పి, రామన్ సంగతేమిటని అడిగాడు రమణ. రామన్ తన సంగతి చెప్పుకోటానికి కొంత సంకోచించినా, రమణతోగల తన స్నేహం గుర్తుకు వచ్చింది, ఇద్దరూ ఒకే కడుపున పుట్టిన అన్నదమ్ములకన్న మిన్నగా మెలిగారు. ఒకరికొకరు ఆప్తులుగా ఉండేవారు. అందుచేత రామన్ తన సంగతినంతా రమణకు చెప్పాడు.

'ఒరే రామన్! ఈ రోజునుండీ నీవుకూడా మా ఆఫీసు పనిలోచేరు నేను ఉద్యోగం ఇచ్చేవాడినీ, నీవు ఉద్యోగం చేసేవాడివీ అనే భావం రానీకు. ఆఫీసులో నాతో సమానమైన స్థానం నీకు లభించేటట్లు చేస్తాను" అన్నాడు.

రామన్ సంతోషంతో పొంగిపోయాడు తన పట్టుదల నెరవేరింది. ఉదయంనుండే ఉద్యోగం లేకుండా ఇంటికి పోకూడదని ప్రతిజ్ఞ చేసుకుని ఉన్నాడు. ఇక జానకి దగ్గరకు పోయి ఈ సంగతి చెప్పాలి జానకి ఎంత సంతోషిస్తుందో ఈ వార్త వింటే

'రమణా డబ్బు కావాలిరా" అన్నాడురామన్. రమణ అతనికి పద్ది యిచ్చాడు. రామన్ దానిలోనుండి అయిదు వదిరూపాయల నోట్లు తీసుకుని పర్సు తిరిగిఇస్తూ "వస్తారా! మళ్ళీ కలుసుకుంటాను" అని బయలుదేరాడు.

పాపకి పాలడబ్బాలు రెండు. జానకికి పళ్ళూ, గ్లాకోజు మందులూ కొన్నాడు ఆప్పు తీసుకుని సంతోషంతో గబగబా ఇంటికి చేరుకున్నాడు

"జానకీ జానకీ!" అని పిలిచాడు అదుర్దాగా.

జానకి మంచంమీద ముసుకుపెట్టి ఉన్నది ఇల్లంతా నిశ్శబ్దంగా ఉన్నది.

"జానకీ! ఇవిగో నీకు మందులూ పళ్ళూ. హార్లిక్స్ తెచ్చాను. పాపకి పాలడబ్బాలు తెచ్చాను ఇవన్నీ ఎక్కడివండీ అని అడగవేమి! ... జానకి ... ఈనాటితో మన కష్టాలు గట్టెక్కినాయి. ఈనాడే నేను ఉద్యోగంలో చేరుతున్నాను. నా స్నేహితుడు రమణద్వారా ఉద్యోగం దొరికింది జానకీ "

అంటూ రామన్ ఆమె దగ్గరకి వెళ్ళాడు

ఆకలితోనూ, రోగాలూ, బాధలతోనూ శుష్కించిపోయిన జానకి, ఆకలిబాధకు తట్టుకోలేకపోయింది. ఆమె ప్రాణవాయువులు అనంత వాయువుల్లో లీనమైనాయి ఆమె రొమ్ములపైన పడిఉన్న పసిబిడ్డను చూశాడు రామన్. ఆకలి బాధకు తట్టుకోలేక, గొంతు ఎండిపోయి, ఏడ్చి ఏడ్చి ఆబిడ్డకూడా చనిపోయింది.

అభాగ్య రామన్, భార్యనీ, బిడ్డనీ, దక్కించుకోలేక హతాశుడై కూలిపోయాడు.

☆